క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే కాటసాని రోడ్‌షో

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు, కమలపూరి సచివాలయ పరిధిలోని గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్నికల ప్రచారం, రోడ్ షో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మెహన్ రెడ్డి తెలిపారు. హోత్రమాన్‌దిన్నె, వసంతాపురం, నట్లకొత్తూరు, బొందలదిన్నె, కమలపురి, ముదిగేడు, ఎగ్గోని, ముచ్చలపూరి, కొత్తపేట తదితర గ్రామాలలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యే రోడ్‌షోను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ప్యాపిలి: స్థానిక వెంగన్న బావి వద్ద వెలసిన కొప్పు అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ధ్వజస్తంభ దాత పరంగి కొండప్ప ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పర్వతం శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డి, మాసాని పరమేశ్వరయ్య, గ్రామ పెద్దలు బోయ నడిపెన్న, పరంగి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు, గర్భిణులు, రోగులకు ఆదివారం రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేశారు. ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో నతానియల్ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుంకన్న, వంశి, కావ్య, ఏసేపు, రాజేష్, ప్రవీన్‌లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

రేపటి నుంచి పాలికి వరచిదంబర స్వామి ఆరాధనోత్సవాలు



పాలికి వర చిదంబర స్వామి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కొలువైన శ్రీ పాలికి వర చిదంబర స్వామి ఆరాధనోత్సవాలు 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థాన్ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ,బుధ వారాల్లో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, గురుపూజ, లీలామృతం ప్రవచనాలు, సత్సంగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 24వ తేదీన భజన పోటీలు ఉంటాయని, 9966123789 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

శుభకార్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నందిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ యువనాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి వివాహం ఆదివారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు చల్లా విక్రాంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సన్మానం



శ్రీనివాసులును సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలోని పాతపేట టీచర్‌గా విధులు నిర్వహించే ఎంఏ శ్రీనివాసులును పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఆదివారం స్కూల్లో హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ-2 రామనర్సప్ప హాజరయ్యారు. శ్రీనివాసులుకు ఎంఈఓతోపాటు ఉపాధ్యాయులు, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, నెహ్రూనగర్ హైస్కూల్ హెచ్‌ఎం తొగట సురేష్‌బాబు, మాజీ హెచ్‌ఎం రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న మంత్రి బుగ్గన



మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఆదివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బేతంచెర్ల పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆంజనేయ, వేంకటేశ్వరస్వామి, అమ్మవారిశాలలో మంత్రి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహమ్మద్ దీవాన్‌షా ఖాద్రీ దర్గాతోపాటు సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు చేశారు. ముందుగా పట్టణంలోని అంగళ్ల బజారు, కోటపేట, చాకలిపేట, వడ్డెపేట, దుర్గాపేట, బోయపేట, పాతపోస్టాఫీస్ లైన్, శ్రీనగర్ కాలనీ, సబ్ రిజిస్ట్రార్ కాలనీ, కొత్త బస్టాండ్, బైటిపేట, పాత బస్టాండ్ కాలనీలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలుతో కలిసి మంత్రి బుగ్గన విస్తృతంగా పర్యటించారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. సీఎం సాయంతో డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని మంత్రి గుర్తు చేశారు. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రతి కాలనీలో ప్రజలు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. పెద్దఎత్తున ప్రజలు తరలిరావడంతో ఆయా కాలనీలు కిక్కిరిసిపోయాయి. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజల వద్దకు పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, వైసీపీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజా, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, నాగరాజు, లక్ష్మిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శేఖరయ్య, బూషిరెడ్డి, మునేశ్వర్‌రెడ్డి,రమణారెడ్డి, అల్తాఫ్ హుసేన్, పిట్టల జాకీర్, సయ్యద్, అజాం, సలీమ్, ఖాజా, పవన్, ఆకుల రమణ, బొల్లి మద్దిలేటి, రమేష్, భాస్కర్, ఎద్దులన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 50 కుటుంబాలు

డోన్ మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఆదివారం టీడీపీ, సీపీఐని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక స్వగృహంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో ఆ కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఎద్దుపెంట గ్రామానికి చెందిన బంగారు జయచంద్ర ఆధ్వర్యంలో మనోహర్, మహేష్, మహేష్ రెడ్డి, ఇబ్రహీం, రాఘవేంద్ర, గిడ్డయ్య, వడ్డె జయన్న, గోరంట్ల, పీరాం బాషా, మౌలాలీ, మధు క్రిష్ణ, వీరాంజనేయులు పాటు మరో 38 కుటుంబాల సభ్యులకు మంత్రి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన డోన్ మండలం ఎద్దుపెంట గ్రామస్తులు

మంత్రి బుగ్గనకు నీరాజనం



మంత్రి బుగ్గనకు హారతి పడుతున్న మహిళలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా అంగళ్ల బజారు, కోటపేట, చాకలిపేట, వడ్డెపేట, దుర్గాపేట, బోయపేట, పాతపోస్టాఫీస్ లైన్, శ్రీనగర్ కాలనీ, సబ్ రిజిస్ట్రార్ కాలనీ, కొత్త బస్టాండ్, బైటిపేట, పాతబస్టాండ్ కాలనీలలో పర్యటించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి జనం నీరాజనం పలికారు. యువకులు, పెద్దలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంత్రి బుగ్గనపై పూల వర్షం కురిపిస్తూ గజమాలలతో సత్కరించారు. బోయపేట కాలనీల్లో యువకులు పెద్ద ఎత్తున్న బాణా సంచా పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. క్రేన్ సహాయంతో గజమాల వేశారు. బుగ్గన హ్యాండ్ హెల్డ్ స్పార్కిల్ ఫైర్‌గన్‌ను గాలిలోకి గురిపెట్టి కాల్పులు జరపడంతో యువకులు కేరింతలు కొట్టారు. బుగ్గనకు అనుకూలంగా చేసిన నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అదేవిధంగా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా చేసి శాశ్వత పరిష్కారం చూపిన విషయాన్ని గుర్తు చేసిన మహిళలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. హిజ్రాలు సైతం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గుమ్మడికాయలు కొట్టి దిష్టి తీశారు. మంత్రికి హారతులుపట్టి, తిలకందిద్ది ఆయా కాలనీల మహిళలు స్వాగతించారు. బేతంచెర్ల మండలంలో విద్య, వైద్య రంగాలతో పాటు తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన అపర భగీరథుడు బుగ్గన అంటూ శ్రీనగర్ , బైటిపేట, జెండాపేట, గౌరి పేట కాలనీలలో యువకులు వైఎస్సార్‌సీపీ జెండాలతో కూడిన గజమాలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలి



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు పంపిణి చేస్తున్న కాటసాని జయమ్మ

బనగానపల్లె రూరల్ : కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ ప్రజలను కోరారు. ఆదివారం సాయంత్రం మండలంలోని హుస్సేనాపురం, ఎర్రగుడి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాటసాని జయమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలోనూ అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నావడీ, వైఎస్సార్ ఆసరా, చేయూత తదితర పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. మాయ మాటలతో మభ్యపెడుతున్న టీడీపీ నాయకుల హామీలను నమ్మొద్దన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాటసాని రామిరెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం నబీసాహెబ్, ఇదుర్ సాహెబ్, నాగోషుడు, గడ్డంబాషా,శివనారాయణ,టి హనీఫ్, షాలుసాహెబ్, ఎస్ హుస్సేన్‌బాషా,ఎస్ షేక్షావలి, జీటీ శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి



7వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



9వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మహిళా కౌన్సిలర్లు

డోన్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమానంగా ప్రాధానిచ్చి పాలన సాగించిన సీఎం జగన్ ప్రభుతానికి మరోమారు పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పట్టణ ప్రజలను కోరారు. ఆదివారం ఆయన కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర, ఆర్జ రమణ, సుంకన్న, పాలుట్ల రఘురాం, వెంకట్రాముడుల ఆధ్వర్యంలో 7, 8వ వార్డులలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, కోఆర్డినేటర్ దినేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్‌ఈ రాజవర్ధన్, నాయకులు మిట్టా రవి, కోఆప్షన్ సభ్యులు రఫీ, కుమ్మరి రాజు పాల్గొన్నారు

9వ వార్డులో ప్రచారం

డోన్‌ను మోడల్ నియోజకర్గంగా తీర్చిదిద్దిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మహిళా కౌన్సిలర్లు ప్రజలను కోరారు. పట్టణ పరిధిలోని 9వ వార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లు మిట్టా ఉమామహేశ్వరి, వెంకటేశ్వరమ్మ, సుకన్య, శివలక్ష్మి, బోయ సుమలత, మేకల విమల, బుర్రు రమాదేవి, ఇంతియాజ్ కాలేషా, పాలుట్ల మీనాక్షి, మౌళాబీ, మహబూబ్‌బీ ఇంటింటి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్రు శ్రీధర్, గౌండ గౌస్, లక్ష్మిరెడ్డి, క్రిష్ణ, షేక్షావలి, మేడా రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కొలిమిగుండ్ల: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 158 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగా 147 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాతంగా జరిగాయి. 171 మంది దరఖాస్తు చేసుకోగా 152 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మరియదాసు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు మజ్జిగ పంపిణీ చేశారు.

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష మొత్తం 158 మంది విద్యార్థులు హాజరుకావాల్సి వుండగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. పరీక్ష కేంద్రం చీఫ్ ఆఫీసర్‌గా ప్రిన్సిపాల్ రామలక్ష్మీ, డిపార్ట్‌మెంట్ ఆఫీసరుగా ఉపాధ్యాయుడు శేఖర్ వ్యవహరించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

బేతంచెర్ల : పట్టణ సమీపాన వెలసిన చౌడేశ్వరీ దేవి తిరునాల ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక శేషారెడ్డి హైస్కూలు మైదానంలో పాల పండ్లలోపు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. పోటీలను చౌడేశ్వరి దేవి ఆలయ కమీటీ సభ్యులు గౌరి హుస్సేన్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈలలు, కేరింతల మధ్య రసవత్తరంగా పోటీలు జరిగాయి. కర్నూలు మండలం, రుద్రవరం వృషభాలు మొదటి స్థానం కైవసం చేసుకోగా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడకు చెందిన వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా బండి ఆత్మకూరు వృషభాలు మూడవ, తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూలుకు చెందిన వృషభాలు నాల్గవ, బనగానపల్లె మండలం టంగుటూర్‌కు చెందిన వృషభాలు ఐదవ స్థానంలో నిలిచాయి. వృషభాల యాజమానులకు వరుసగా రూ.50 వేలు,రూ 40 వేలు, రూ. 30 వేలు, రూ.20 వేలు రూ.10 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘురామిరెడ్డి, రామాంజనేయులు, శేఖర్‌రెడ్డి, రామస్వామి, అన్నారావు, అజయ్, మధుమోహన్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబుకు ఓటుతో గుణపాఠం చెప్పాలి

- రోడ్‌షోలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,



వైఎస్సార్‌సీపీలో చేరిన పాదుపు మహిళలతో ఎమ్మెల్యే , జెడ్పీ చైర్మన్

కొలిమిగుండ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మళ్లీ మాయమాటలతో మభ్యపెడుతున్న చంద్రబాబుకు ఓటుతో మరోమారు గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ కాటసాని ప్రసాదరెడ్డితో కలిసి అబ్దుల్లాపురం, కోర్నపల్లె, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం, రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ నాలుగు గ్రామాలకు సంబంధించి సంక్షేమ పథకాల రూపంలో రూ.24.68 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయిందని గుర్తు చేశారు. 2019లో ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గతంలో ఐదేళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని నిండా ముంచారని చెప్పారు. వైఎస్ జగన్ డ్వాక్రా మహిళలకు చెప్పిన ప్రకారం నాలుగు విడతల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారని పేర్కొన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు.

పథకాలు ఇస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు

ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని ఎమ్మెల్యే కాటసాని విమర్శించారు. ఎన్నికలు రావడంతో సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ నాయకులు గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. గతంలో బాబు విస్మరించిన హామీల విషయంపై నిలదీయాలన్నారు. ఐదేళ్ల పాలనలో నీరు-చెట్టు పేరుతో వాగులు, వంకల్లో పిడికెడు మట్టి తీసి దోపిడీ చేశారని ఆరోపించారు. జన్మభూమి కమిటీలు పేదలను ముప్పుతిప్పలు పెట్టారని, రేషన్ కార్డు కూడా లంచాలు తీసుకున్నారని ధ్వజమెత్తారు. ఏప్రభుత్వంలో మంచి జరిగిందో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, కొండయ్యగౌడ్, వెంకటరెడ్డి, శంకరయ్య, పులి పెద్దిరెడ్డి, రామనాథ్‌రెడ్డి, క్రిష్ణయ్య, సోమయ్య, మొలక రాజారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన పొదుపు మహిళలు

అంకిరెడ్డిపల్లెకు చెందిన 30 మంది పొదుపు మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అబ్దులాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని వద్దకు వచ్చి స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరారు. పొదుపు మహిళలు లక్ష్మి, సుబ్బమ్మ, ఓబులమ్మ, శిరీష, వన్నూరమ్మ, చెన్నమ్మ, రామతులసి, అనిత, శ్రీవిద్య, ఫాతిమాబి తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ సానుభూతి పరుడైన బుక్‌కీపర్ కార్తీక్ తమ డబ్బులు వాడుకొని బ్యాంక్‌లో జమ చేయకుండా తమను మోసం చేశారని ఎమ్మెల్యే దృష్టికి మహిళలు తీసుకొచ్చారు. తప్పక న్యాయం చేస్తామని, అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టేదన్నారు. తప్పకుండా డబ్బులు రికవరీ చేయిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల సంబంధించి విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డి పల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

కాంగ్రెస్‌పార్టీ బనగానపల్లె అసెంబ్లీ అభ్యర్థిగా బాలపుల్లయ్య

కోవెలకుంట్ల: కాంగ్రెస్ పార్టీ బనగానపల్లె అసెంబ్లీ అభ్యర్థిగా గూటం బాలపుల్లయ్య అలియాస్ బాలుయాదవ్ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ మేరకు కర్నూలులో పార్టీ చీఫ్ షర్మిల ఆదివారం బాలపుల్లయ్యకు బీఫామ్ అందజేశారు. సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన బాలపుల్లయ్య ఇరవై ఏళ్ల క్రితం కోవెలకుంట్లలో స్థిరపడ్డారు.

డోన్ అభ్యర్థిగా మద్దిలేటిస్వామి..

డోన్ టౌన్ : డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామికి ఆ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం కర్నూలులో బీ ఫారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేసి మద్దిలేటిని అభినందించారు.

పారా రోయింగ్ విజేత భారత్

- భారత్ తరపున తలపడిన ప్యాపిలికి చెందిన వెంకటనారాయణ



విజేతగా నిలిచిన వెంకటనారాయణ, అనిత

ప్యాపిలి: సౌత్ కొరియాలో జరిగిన పారా రోయింగ్‌లో భారత్ విజేతగా నిలిచింది. ఈ నెల 19 నుంచి 21 వరకు సౌత్ కొరియాలో జరిగిన పారా ఒలంపిక్స్ క్వాలిఫై రగాటా పోటీల్లో రాజస్థాన్‌కు చెందిన అనితాతో కలసి ప్యాపిలికి చెందిన వెంకటనారాయణ భారత్ తరపున తలపడ్డాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో వీరి ద్వయం రెండు కిలోమీటర్ల దూరాన్ని 7.50 నిమిషాల్లో చేరుకుని మొదటి స్థానంలో నిలిచారు. భారత్‌తో పాటు థాయ్‌లాండ్, కొరియా, కజకిస్తాన్, జపాన్, హాంకాంగ్ తదితర దేశాలు తలపడిన ఈ పోటీల్లో భారత్ విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో విజయం సాధించడంతో ఈ ఏడాది పారిస్‌లో జరిగే పారా ఒలంపిక్ పోటీలకు అర్హత సాధించినట్లు వెంకటనారాయణ తెలిపారు.

పట్టుబడిన అక్రమ మద్యం ధ్వంసం

డోన్ రూరల్ : పట్టణ శివారులో ఆదివారం సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండ్ బి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సెబ్ పోలీసులు వివిధ కేసులలో పట్టుబడిన అక్రమ మద్యంను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పాతకేసులలో ముద్దాయిలను బైండోవర్ చేశామన్నారు. అలాగే అక్రమ మద్యం అమ్మేవారిపై, నిలువలు ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి, ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎంగా కావాలని పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న గుండం నాగేశ్వరరెడ్డి, నాయకులు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న గుండం నాగేశ్వరరెడ్డి

బనగానపల్లె రూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని నందివర్గం గ్రామ సమీపంలో వెలిసిన కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రం వరకు పాదయాత్ర చేశారు. ఆదివారం సాయంత్రం నందివర్గం గ్రామంలోని కొత్తూరు క్షేత్రం వైపు వెళ్లు ముఖ ద్వారం వద్దకు భారీ ఎత్తున్న కార్యకర్తలు చేరుకున్నారు. అక్కడి నుంచి కాలి నడకన ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం చేరుకున్నారు. స్వామి వారికి పాలాభిషేకం, తదితర పూజలు చేశారు. ఈ సందర్భంగా గుండంనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందాలని, 2024లోనూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని సుబ్రహ్మణ్యం స్వామికి పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు అంబటి రవి కుమార్ రెడ్డి, నాయకులు గుండం సురేంద్రరెడ్డి, గగ్గటూరు చంద్రోశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.